హైదరాబాద్ వార్త

జలమండలిలో పేరుకుపోయిన ఈ-వ్యర్థాల రీసైక్లింగ్

హైదరాబాద్, మే 30 ప్రభాతవార్త

జలమండలి ప్రధాన కార్యాలయం, వివిధ విభాగాల్లో గత 15 నుండి 20 సంవత్సరాలుగా నిల్వలో ఉన్న ఈ-వ్యర్థాలు,వాడుకలో లేని ఐటీ పరికరాల శాస్త్రీయ నిర్వహణ, రీసైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించింది. ఈవ్యర్థాల సేకరణ, రవాణా మరియు పర్యావరణ హిత రీసైక్లింగ్ కోసం తెలంగాణ గ్రీన్ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా ఓ రిపైనింగ్ సంస్థను అధికారిక ఏజెన్సీగా నియమించింది. నిర్వహణకు ఎంపిక చేసిన వస్తువుల్లో పాత ప్రింటర్లు, సీఆర్టీఈ మానిటర్లు, సీపీయూలు, యూపీఎస్ వ్యవస్థలు, ఇతర కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయి. వీటిని ప్రస్తుత ఈవ్యర్థాల నిర్వహణ నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ మార్గదర్శకాలకు అనుగుణంగా సురక్షితంగా, బాధ్యతాయుతంగా రీసైక్లింగ్ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా హరితాభివృద్ధికి జలమండలి తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోంది. పాత ఎలక్ట్రానిక్ పరికరాల రీసైక్లింగ్ ద్వారా వ్యర్థాల నిర్వహణలో ఆదర్శప్రాయ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈవ్యర్థాల లోడింగ్, తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని, వాటిని అధీకృత రీసైక్లింగ్ కేంద్రానికి తరలించి పర్యావరణహిత పద్ధతుల్లో నిర్వహించనున్నట్లు జలమండలి వెల్లడించింది.

వామ్మో ఫీజులు..!

- తల్లిదండ్రులను దడపుట్టిస్తున్న జూన్ నెల
- డొనేషన్లు, టర్మ్‌ఫీజుల ,బ్యాగులు, పుస్తకాల భారం
- ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల మోత

హైదరాబాద్, మే 30,ప్రభాతవార్త:

జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల్లో దడ మొదలువుతుంది. నూతన విద్యాసంవత్సరానికి కొద్దిరోజులే గడవు ఉండటంతో అందుకు అనుగుణంగా పిల్లల తల్లిదండ్రులు చదువుకోసం ఇంటి బడ్జెట్‌ను తయారు చేస్తున్నారు. ఖర్చు భారంగా మారిన పిల్లల భవిష్యత్ కోసం వెచ్చించక తప్పదని భావించి ఖర్చులకు వెనుకాడటం లేదు. సామాన్య, మధ్యతరగతి వారు ప్రైవేట్ ఉద్యోగులు ఇందు కోసం కొన్నినెలల నుంచే తమ ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు ఇతర పనుల కోసం డబ్బులను వెచ్చించుకుండా వాయిదా వేసుకుంటున్నారు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బుక్కులు, లంచ్‌భాక్సులు వంటి ఖర్చులకు అప్పుల కోసం పరిగెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. జూన్12న పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు కొద్దికొద్దిగా చేరుకుంటున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యారునతల కోసం స్టేషనరీ దుకాణాల్లో పుస్తకాల అమ్మకాలు మొదలుపెట్టారు. ఒక్కోనోట్ బుక్కుపై రూ.10నుంచి 15వరకు పెరిగాయి. మరోవైపు స్కూల్ ఫీజుల మాట వింటుంటే తల్లిదండ్రుల భయపడిపోతున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంజనీరింగ్‌కు వెళ్లే పిల్లలు ఉంటే బంగారం వంటి వస్తువులు తాకట్టు పెట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు అడ్మిషన్లు, పుస్తకాలు అయిపోతాయంటూ ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న ప్రచారం అంతా ఇంతా కాదు. దీంతో జూన్ ఖర్చుల నుంచి ఎలా గట్టెక్కాలో తెలియని పరిస్థితి పేద కుటుంబాల్లో కనిపిస్తుంది. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో వివిధ రకాల ఫీజుల పేరుతో వసూలు చేస్తూ తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారు.

యూనిఫాం..ఇతర ఖర్చులు

పాఠశాలలు తెరచుకోవడంతోనే ఫీజులు చెల్లిచడం ఒకభారమైతే ఇతర ఖర్చులు ఇబ్బందులకు గురి చేస్తాయి. పిల్లలను పాఠశాలకు పంపించడానికి యూనిఫాం ఇతర సామాగ్రి కొనుగోలు కష్టంగా మారతుంది. పుస్తకాలు,డ్రెస్‌లు, షూ, సాధారణ దుస్తుల ఖర్చు, బస్సు ఫీజు ఇలా అనేక విషయాలుపై తల్లిదండ్రులు లెక్కలు వేసుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో బయట నోట్ పుస్తకాలు ,పాఠ్యపుస్తకాలు కొనుగోలుకు ఒప్పుకోరు. పాఠ్యపుస్తకాలు, బ్యాడ్జీలు పాఠశాల్లోనే కొనుగోలు చేయడంతో కనీసం ఉద్దెర పొందే పరిస్థితి ఉండదు. యాజమాన్యాలు నిర్ణయించిన రేటుకు తీసుకోవడానికి కూడా పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి ఇంటికి అదనంగా 20 నుంచి 60వేల ఖర్చు..

జూన్‌లో విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుందటేనే ప్రతి ఇంటిలో ఎల్‌కేజీ నుంచి పదోతరగతి ,ఇంటర్మీడియట్ వరకు టర్మ్‌ఫీజులు, బస్‌రవాణాతోపాటు ఇతర ఖర్చులు కలిపితే 20వేల నుంచి 60వేల వరకు ఖర్చవుతుంది. కార్పొరేట్ పాఠశాలలు కుప్పలు తెప్పలుగా ఉంటంతో పిల్ల చదువులకోసం మద్యతరగతి కుటుంబాలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. ఇంజనీరింగ్ చదవాలంటే కళాశాలల్లో ఫీజుల రియంబర్స్‌మెంట్ మినహాయించి కళాశాలల్లో ఫీజులు లక్షల్లోనే ఉన్నాయి. మరోవైపు హాస్టల్ ఫీజుల అదనపు భారం ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ ఫీజులు వేలల్లో ఉన్నాయి. దీనికి తోడు ఈవెంట్స్ పేరుతో అదనపు వసూళ్ల కూడా చేస్తుంటారు. పుస్తకాలతోపాటు బ్యాగులు ,టిఫిన్‌బాక్సుల రేట్లు మండిపోతున్నాయి.

రూ.161 కోట్లతో సిఎంసి శాశ్వత భవనం

- -ఒకే చోట పాలనా కార్యకలాపాలు
- -రోడ్ల అభివృద్ధి ..దోమల నివారణకు ప్రత్యేక చర్యలు
- -సిఎంసి స్టాండింగ్ కమిటీలో 11 అంశాలకు ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న జయేష్‌రంజన్, కమిషనర్ సృజన తదితరులు

హైదరాబాద్,మే 30, ప్రభాతవార్త:

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరే షన్ (సీఎంసీ) 4వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం కార్పొరేషన్ ప్రత్యేక అధికారి జయేష్ రంజన్ అధ్య క్షతన జరిగింది. నాక్‌లోని సి ఎంసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిషనర్ జి.సృ జనతోపాటు అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టౌన్ ప్లానింగ్ ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన పలు అంశాలను ఆమోదించారు.ముఖ్యంగా ఖానామెట్ గ్రామ పరిధిలోని ముడికుంట సరస్సు సమీపంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత కార్యాలయ భవన నిర్మాణానికి సుమారు ..రూ.161 కోట్ల అంచనా వ్యయంతో.. ఆమోదం లభించింది. ఈ భవనం ..జి+8 అంతస్తులతో నిర్మించబడగా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా జి+12 వరకు విస్తరించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా కార్పొరేషన్ పరిపాలనా కార్యకలాపాలు ఒకే చోట కేంద్రీకృతమై ప్రజా సేవల అందింపు మరింత మెరుగుపడనుంది. అలాగే ఘన వ్యర్థాల నిర్వ హణకు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సేవల వినియోగానికి సంబంధించిన 6వ అంశం ఉపసంహరించబడింది...జె.జె.నగర్ - కొంపల్లి (ఫాక్స్ సాగర్ సరస్సు) రోడ్డు అభివృద్ధి ప్రణాళిక..జె.జె.నగర్ నుండి కొంపల్లి వరకు గ్రోమోర్ ఫుడ్ నర్సరీ (ఫాక్స్ సాగర్ సరస్సు) మీదుగా ప్రతిపాదించిన ..30 మీటర్ల వెడల్పు రోడ్డు అభివృద్ధి ప్రణాళిక . అమలుకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు ద్వారా రహ దారి అనుసంధానం మెరుగుపడి, భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందనున్నాయి. అమీన్‌పూర్ కమాన్ - గాంధీ విగ్రహం - బండం కొమ్ము చెరువు రోడ్డు అభివృద్ధి ప్రణాళిక..ప్రతిపాదిత ..45 మీటర్ల వెడల్పు రోడ్డు అభివృద్ధికి ఆమోదం లభించింది. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగం బలోపేతం చేస్తూదరఖాస్తుల పరిష్కా రం, ఫీల్డ్ తనిఖీలు, అమలు చర్యలు, పౌర సేవల అందింపును మరింత సమర్థవంతంగా నిర్వహిం చేందుకు ఈవిభాగంలో అవసరమైన సిబ్బంది నియామకానికి ఆమోదం లభించింది. అలాగే మౌలిక సదుపాయాల వనుల పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, ఫీల్డ్ సూపర్‌విజన్, ప్రాజెక్టుల అమలును బలోపేతం చేసేందుకు ఇంజినీరింగ్ విభాగంలో సాంకేతిక సహాయక సిబ్బంది నియామకానికి ఆమోదం. అలాగే విలీనం అయిన యూఎల్బీ ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక ఎంటమాలజీ పైలట్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇందులో ఫాగిం గ్, పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకం మరియు ప్రజారోగ్య చర్యలు చేపట్టబడతాయి. అ లాగే అర్బన్ బయోడైవర్సిటీ కార్యకలాపాల కోసం బకెట్ ల్యాడర్లు..చెట్ల కొమ్మల కత్తిరింపు, నిర్వహణ వాహన ఆధారిత బకెట్ ల్యాడర్లను.. నియమించేందుకు ఆమోదం లభించింది.ఇలా స్టాండింగ్ కమిటీలో మొత్తం 11అంశాలకు ఆమోదం లభించింది.

నిమ్స్‌లో క్యాన్సర్ జీనోమిక్ కేంద్రం ఏర్పాటు

-ఎన్‌జీఎస్ సాంకేతికతో ఏర్పాటు

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః ప్రభుత్వ రంగంలో అత్యాధునిక క్యాన్సర్ జీనోమిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తొలి ఆసుపత్రిగా నిమ్స్ నిలిచింది. క్యాన్సర్‌కు సంబంధించిన జన్యు మార్పులను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించే నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సాంకేతికతతో ఈ కొత్త కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడంతో పాటు, రోగికి అత్యంత ప్రభావవంతమైన చికిత్సా విధానాన్ని వైద్యులు ఎంపిక చేయడానికి అవకాశం కలుగుతుంది. తెలంగాణలో ప్రభుత్వ రంగంలో ఎన్‌జీఎస్ ఆధారిత క్యాన్సర్ నిర్ధారణ సేవలను అందిస్తున్న తొలి ఆసుపత్రి నిమ్స్ కావడం విశేషం. ఈ కేంద్రాన్ని కేంద్ర ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్), భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) సంయుక్తంగా అమలు చేస్తున్న అడ్వాన్స్‌డ్ మాలిక్యులర్ ఆంకాలజీ డయాగ్నస్టిక్ సర్వీసెస్ పథకం కింద ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ఎంపికైన సుమారు 25 కేంద్రాల్లో నిమ్స్ ఒకటిగా ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక కేంద్రం నిమ్స్‌నే అని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. భీరప్ప తెలిపారు.ఈ అత్యాధునిక ప్రయోగశాలలో ఎన్‌జీఎస్, పీసీఆర్, డిజిటల్ డ్రాప్లెట్ పీసీఆర్(డీడీపీసీఆర్), ఫిష్, ఇమ్యునోహిస్టోకెమిస్ట్రీ (ఐహెచ్‌సి) వంటి పలు ఆధునిక క్యాన్సర్ పరీక్షలను అర్హులైన రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు 1,443 మంది క్యాన్సర్ రోగులు ఈ సేవల ద్వారా లబ్ధి పొందినట్లు పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ తెలిపారు. వీరిలో 784 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్, 659 మంది రొమ్ము క్యాన్సర్ రోగులు ఉన్నారు. ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా ఇప్పటివరకు ఖరీదైన కారణంగా అందుబాటులో లేని అత్యాధునిక పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా రోగులకు చేరువవుతున్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్యాన్సర్ స్పెసిఫిక్ ఎన్‌జీఎస్ పరీక్షలతో పాటు, రక్త నమూనా ద్వారా క్యాన్సర్‌ను గుర్తించి పర్యవేక్షించే లిక్విడ్ బయాప్సీ సాంకేతికతను కూడా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కొత్త క్యాన్సర్ జీనోమిక్స్ కేంద్రం ద్వారా తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలకు ఆధునిక క్యాన్సర్ నిర్ధారణ సేవలు, మెరుగైన చికిత్సా అవకాశాలు అందుబాటులోకి వచ్చి, రోగుల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని నిమ్స్ అధికారులు తెలిపారు.

అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్

నిమ్స్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః

ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా నిమ్స్ ట్రామా బ్లాక్‌లో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రి పరిపాల విభాగం, అత్యవసర మెడిసిన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ ఈ మాక్ డ్రిల్ నిర్వహించింది. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి, రోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డమ్మీ పేషెంట్ల సహాయంతో డ్రిల్ నిర్వహించినట్లు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. అత్యవసర మెడిసిన్ విభాగాధిపతి డా.సునీల్, ట్రామా బ్లాక్‌లోని వివిధ విభాగాల సిబ్బంది, నర్సింగ్ అధికారులు, టెక్నీషియన్లు, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖకు చెందిన అధికారులైన జిల్లా ఫైర్ ఆఫీసర్ టి. వెంకట్, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి. భానుప్రసాద్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.డి.షౌకత్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.సాయి రెడ్డి పాల్గొన్నారు.

అంబరాన్నంటిన తెలంగాణ ప్రజాకళా విన్యాసాలు

కళాకారిణుల ప్రదర్శనల్లో ఒక దృశ్యం

రవీంద్రభారతి, మే 30 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1నుండి నిర్విరామంగా జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా 60వ రోజు రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతిక మహోత్సవాలలో శనివారం రాత్రి కళాకారిణులు తెలంగాణ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పట్టం కడుతూ ప్రదర్శించిన వివిధ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అంబరాన్నంటి కళాభిమానులు, ఆహుతుల విశేష స్పందన అందుకోవడంతోపాటు తన్మయుల్ని చేశాయని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. నేటి మహిళా కళాకారుల ప్రతిష్టాత్మక ప్రదర్శనలో ప్రముఖంగా స్వప్న బృందం జానపద, శాస్త్రీయ నృత్యప్రదర్శనలు ఎంత గానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు సరిత, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారధి ఏఓ డా. విజయ్‌కుమార్, సాంస్కృతికశాఖ సలహాదారు ఎం.దినకర్ తదితరులతో కలిసి నేటి కళాప్రదర్శనల్లో పాల్గొన్న మహిళలను ఘనంగా సత్కరించారు. సభకు విద్వాన్ నందచారి, సోనిలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తల్లి,కొడుకు ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి,మే 30 ప్రభాతవార్త : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తల్లి కొడుకు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం...లక్ష్మీగూడ రాజీవ్‌గృహ కల్పలో వీరమ్మ (50), కొడుకు నర్సింహ (28)లు నివాసం ఉంటున్నారు.వీరమ్మ భర్త చనిపోవటంతో తల్లి కొడుకులిద్దరూ కూలి పని చేస్తూ జీవనాన్ని నడుపుతున్నారు.గత కొంత కాలంగా వీరికి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావటంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.కూలి పని చేస్తున్న నర్సింహ్మకు ఆర్థిక సమస్యలు వల్ల వివాహం కావటం లేదు.దీంతో తల్లి,కొడుకు తీవ్ర మనోవ్యధకు గురియ్యారు.కాగా తల్లి వీరమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడు నర్సింహ ఎలుకలు మందు త్రాగి ఆత్మహత్యకు పాల్పడాడు.వీరి బంధువైన స్థానికంగా ఉన్న నర్సింహులు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తల్లి,కొడుకుల మృత దేహాలను స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను బంధువులకు అప్పగించారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ పైడి నాయుడు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

పూడికతీతలపై కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వద్దు

- -అడ్డుగా ఉన్న స్లాబులు తొలగించి పనులు త్వరగా పూర్తిచేయాలి
- -హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం

కాలువలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మే 30,ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని కృష్ణానగర్‌పై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. వర్షం పడితే వాహనాలు కొట్టుకుపోయేంత వరద ముంచెత్తడానికి గల కారణాలను అధ్యయనం చేసిన హైడ్రా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గతంలోనే నిర్ణయించింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను పూర్తి స్థాయిలో తొలగించే పనులను ముమ్మరం చేసింది. కృష్ణానగర్‌లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం పరిశీలించారు. పూడికతీతకు అడ్డుగా ఉన్న స్లాబులను తొలగించి పనులు పూర్తి చేయాలని గతంలోనే ఆదేశించారు. వర్షాకాలం దగ్గర పడుతుండడంతో జీహెచ్ఎంసీతో కలసి పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ద్వారా పనులు స్వీకరించిన కాంట్రాక్టర్‌కు కూడా హైడ్రా కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎక్కడా ఎలాంటి ఆటంకం ఉన్నా హైడ్రా దృష్టికి తీసుకురావాలని.. అలాగే దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికను పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో జూబ్లీహిల్స్, వెంకటగిరి ప్రాంతాల నుంచి పెద్దమొత్తంలో వచ్చే వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. 10 అడుగుల లోతులో ఉన్న వరద కాలువలు దాదాపు 7 అడుగుల వరకూ పూడుకుపోయాయి. అందుకే స్లాబ్‌లు తొలగించి పూడికను మొత్తం తీసే పనులు చేపట్టారు. పనులు పూర్తయిన తర్వాత ప్రమాదాలకు ఆస్కారం లేకుండా.. గట్టి ఇనుప జాలీలు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు కమిషనర్ సూచించారు. ఈ పనులు చాలా కాలం క్రితమే పూర్తవ్వాల్సి ఉందని, పలు మార్లు పరిశీలించినా ఆశించిన పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

మల్కం చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్..

షేక్‌పేట గచ్చిబౌలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మల్కం చెరువు పరిసరాల్లో వరద కాలువల పరిస్థితిని హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్కం చెరువులో నీటి మట్టం తగ్గించడానికి వీలుగా నిర్మిస్తున్న సూయజ్ గేటు.. వరదను తట్టుకునేవిధంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా లేకపోవడంతో ప్రతిఏటా ఇక్కడ వరద ముంచెత్తడం సహజంగా మారిందని.. చెరువులో రెండు మీటర్ల మేర నీరు తగ్గించినప్పుడే వరద నీరు పోటెత్తకుండా సాఫీగా సాగే వెసులుబాటుందని.. ఈ విధంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో ఇన్‌లెట్ల డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలని.. ఔట్‌లెట్ వద్ద స్లూయజ్ గేటును విస్తరించడంతో పాటు.. మరింత కిందకు అమర్చాలని కమిషనర్ సూచించారు. ప్రధాన రహదారి కింద వేసిన పైపులైన్లనో పూడికను తొలగించడానికి రోబోటెక్నాలజీని వాడాలన్నారు. కమిషనర్ వెంట అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఇరిగేషన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు ఉన్నారు.

నాలా పనులకు అడ్డంగా ఉన్న 106 నిర్మాణాలపై చర్యలు

- -చెత్త తొలగించకపోతే చర్యలు తప్పవు
- - ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, మే 30 ప్రభాతవార్త

నాలాల వెంట జరిగిన అక్రమణలపై చర్యలు తీసుకోనున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఉప్పల్ నల్ల చెరువు, దేవేంద్రనగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించారు. ఉప్పల్ నల్లచెరువు వద్ద కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా అభివృద్ధి పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. నాలా అభివృద్ధి పనులకు 106 నిర్మాణాలు అడ్డంకిగా ఉన్నట్లు గుర్తించారు. ఈ నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేసి, టిడిఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు, నాలా అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, ప్రాజెక్టును నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. మొదట దేవేంద్రనగర్ నాలా పరిశీలించిన కమిషనర్ నాలా వెంట జరిగిన భూఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీని ఆదేశించారు. అదే విధంగా దేవేంద్రనగర్ నాలా, టీవీ కాలనీ నాలా ప్రధాన ప్రవేశ మార్గం వద్ద ఉన్న కేసీఆర్ కాలనీ కల్వర్టు ప్రాంతాల్లో దోమల లార్వా గుర్తించారు. లార్వా ప్రారంభ దశలోనే ఉన్నట్లు గురించారు. దేవేంద్రనగర్ నాలా పరిధి అంతటా యాంటీ లార్వల్ ఆపరేషన్స్‌ను ముమ్మరం చేయాలని ఎంటమాలజీ విభాగం సిబ్బందిని ఆదేశించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం

ఉప్పల్ నల్లచెరువు వద్ద ఎస్ఎన్‌డీపీ నాలా అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

దేవేంద్రనగర్ నాలా రోడ్, చర్చ్ కాలనీ రోడ్‌లలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. చర్చ్ కాలనీ రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ సంతృప్తికరంగా లేకపోవడం, శానిటేషన్ కార్మికులు మరియు రామ్‌కీ బృందం చెత్తను సకాలంలో తరలించకపోవడం గమనించారు. దీంతో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, పరిశుభ్రతను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లపై స్వీపింగ్ వ్యర్థాలు మిగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి చెత్త సేకరణ కేంద్రాన్ని రామ్‌కీ బృందం క్రమం తప్పకుండా సందర్శించి, చెత్తను సకాలంలో తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అమరుల వారోత్సవాలను విజయవంతం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాగభూషణం

సైఫాబాద్, మే 30 ప్రభాతవార్త: తెలంగాణ సాధనకు ప్రాణాలను అర్పించిన అమరులను స్మరించుకుంటూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమోని నాగభూషణం చెప్పారు. ఇటీవల బెల్లి లలితక్కకు వర్ధంతి నిర్వహించామని, జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గన్‌పార్కులో ఈ వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు కడమంచి రాంబాబు, ముత్తన్న, కొల్లూరు అంజయ్య, గోపాల పాల్గొన్నారు.

తల్లి కొడులకు వరల్డ్ గిన్నిస్ రికార్డ్ గుర్తింపు

తల్లి, కొడుకులకు వరల్డ్ రికార్డ్ గుర్తింపు సర్టిఫికేట్లు అందజేస్తున్న పాస్టర్ ఆగిస్టిన్ దండింగ్

సైఫాబాద్, మే 30 ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని హలెల్ మ్యూజిక్ స్కూల్‌లో 777 విద్యార్థులతో నిర్వహించిన ఎలక్ట్రానిక్ కీబోర్డు వరల్డ్ గిన్నిస్ రికార్డ్ కార్యక్రమం విక్టరి ఆడిటోరియంలో జరిగింది. ఇందులో తల్లి కొడుకు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికేట్లును సాధించారు. మదీనాగూడలోని జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న డెనియల్ ఆండ్రూ జగడం రెండోవ సారి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి గుర్తింపు పొందగా, తల్లి రుబినా తొలిసారిగా గిన్నిస్ రికార్డ్ సాధించి గుర్తింపు పొందారు. వీరు రెవరెండ్ డా.జాయ్ చెరియన్ నేతృత్వంలోని యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ సంఘ సభ్యులు. ఈ కార్యక్రమాన్ని హలెల్ మ్యూజిక్ స్కూల్ స్థాపకులు పాస్టర్ ఆగస్టిన్ దండింగి నిర్వహించారు. వారికి సర్టిఫికేట్లను ఆగస్టియన్ ప్రదానం చేశారు.

అర్హులైన ఓటర్‌ల పేర్లు పోకుండా చూడాలి

: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 30 ప్రభాతవార్త:
బీ.ఆర్.ఎస్. పార్టీ నేతలు అప్రమతంగా వ్యవహరించి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో అర్హుల ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. జూన్ 3న సికింద్రాబాద్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్. పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్న నేపధ్యంలో శనివారం తార్నాక మునిసిపల్ డివిజన్ బీ.ఆర్.ఎస్. పోలింగ్ బూత్ కమిటీలు, ముఖ్య నేతల సమావేశం సితఫలమండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ జూన్ 3వ తేదిన ఉదయం 9 గంటలకు సితాఫలమండీలో బీ.ఆర్.ఎస్. ప్రతినిధుల సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు ముఖ్య అతిధిగా బీ.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు హాజరవుతారని, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మూద్ అలీ, శాసనసభ్యులు ముటా గోపాల్, కాలేరు వెంకటేష్‌లతో పాటు నేతలు పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని సమావేశంలో ప్రసంగించిన బీఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. సమా వేశంలో సమన్వయకర్తలు,మాజీకార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

31న ఆర్టీసి ఉద్యోగులు డిమాండ్ డే ను పాటించాలి : జెఏసి

చిక్కడపల్లి మే 30 (ప్రభాతవార్త) : ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డే ను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కోకన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎం.ఎస్.అలీ, డి.గోపాల్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, మనోహర్, ఎ.ఎస్.రెడ్డి, జనార్దన్, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి మందిర వార్షికోత్సవ వేడుకలు

బాలబాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

సికింద్రాబాద్, మే 30 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ పద్మారావునగర్ హమాలీ బస్తీ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శ్రీ సత్యసాయి మందిర 32వ వార్షికోత్సవ వేడుకలు శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బాలవికాస్ ప్రతిభా కార్యక్రమంలో బాలబాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేముల హంసిక గణపతి ప్రార్థన నృత్యంతో ప్రారంభమైన ఈ వేడుకలు, పూర్వ విద్యార్థుల కూచిపూడి నృత్యంతో ముగిశాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, మానవతా విలువలపై అవగాహన కోసం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి ఇన్‌చార్జ్ లలితా మాధవరావు, శివం ఇన్‌చార్జ్ హరిహరన్, శ్రీప్రసాద్, హైమవతి, సుధామాధవి, దేవిక, సుబ్బలక్ష్మి ., శ్రీ సాయి విద్యాలయ కరస్పాండెంట్ వెంకటేష్, గురువులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చిలో అఖిల భారత యౌవనస్థుల కూటములు

చిక్కడపల్లి మే 30 (ప్రభాతవార్త) : గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ క్రైస్తవ కేంద్రమైన హెబ్రోన్ చర్చిలో గత ఆరు రోజులుగా జరుగుతున్న అఖిల భారత యౌవనస్థుల కూటములు ఆదివారం (రేపటితో) ఘనంగా ముగియనున్నాయి. శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన ఈ కేంద్రంలో ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఈ నెల 26వ తేదీన ప్రారంభమైన ఈ ప్రత్యేక సభలకు దేశ నలుమూలల నుండి సుమారు 10 వేల నుంచి 15 వేల మంది వరకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా హెబ్రోన్ చర్చి సొసైటీ చైర్మన్ జి. జాన్ సుందర్‌రావు, అధికార ప్రతినిధి రాగి వీరాచారి శనివారం మీడియాతో మాట్లాడారు. దేశంలోని యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, క్రమశిక్షణతో కూడిన సన్మార్గంలో నడిచేలా ఈ ఆరు రోజుల పాటు ప్రత్యేక బోధనలు చేసినట్లు వారు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన యువతీ యువకులకు చర్చి ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల వసతులు, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించినట్లు వివరించారు. ఈ మహాసభలు అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు సొసైటీ ప్రతినిధులు యేసుక్రీస్తు నామములో ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సభలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, భద్రతా పరంగా పూర్తి సహకారం అందించిన చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి, చిక్కడపల్లి సీఐ, ముషీరాబాద్ సీఐ, చిక్కడపల్లి ట్రాఫిక్ సిఐ లకు ధన్యవాదాలు తెలిపారు.

అఖిల భారత యౌవనస్థుల కూటముల ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

పాల ఉత్పత్తులు,పాడి రక్షణపై ముగిసిన శిక్షణ

-మహిళలను అభినందించిన వైస్ చాన్సలర్ జ్ఞాన ప్రకాష్

అత్తాపూర్ మే30,ప్రభాతవార్త :
మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధి కొరకు వివిధ రంగాలలో శిక్షణలు పొందాలని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞాన ప్రకాష్ పేర్కొన్నారు.జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి నాబార్డ్ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో ఎస్ అండ్ టి సిరి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో గల 30 మంది ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు శిక్షణ పూర్తి పూర్తిచేసుకుని పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ సందర్శనకు వచ్చిన మహిళలను వైస్ ఛాన్సలర్ జ్ఞాన ప్రకాష్ అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పాలు ,పాల పదార్థాలు ఉత్పత్తులు పాడి సంరక్షణ అంశంపై గత పది రోజులుగా శిక్షణ ను గురించి ఫీడ్‌బ్యాక్ తెలుసుకున్న మహిళలు గ్రూపుగా ఏర్పడి మహిళలు పాలు పాల పదార్థాలు ఉత్పత్తులను రూపొందించి బ్రాండింగ్ ప్యాకింగ్ చేసి యాదాద్రిలో గల దేవస్థానంలో దాని

హైదరాబాదులో గాని ఇతర పెద్ద పెద్ద పట్టణాలలో మార్కెటింగ్ చేసుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలని పాల పదార్థాలను ముఖ్యంగా పరిశుభ్రంగా ఉండే విధంగా రూపొందించుకోవాలని తెలిపారు .ఈ కార్యక్రమం నిర్వహించిన సిరి స్వచ్ఛంద సేవా సంస్థను అధ్యక్షులు ఎదునూరు శ్రీనివాస ను అభినందించినారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ కిషన్ కుమార్ , అసోసియేట్ డీన్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ డాక్టర్ మాధురి , అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాహిత్య ఫ్యాకల్టీ రాణి స్నేహ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రుల పనితీరు గ్రేడింగ్‌లో ప్రథమ స్థానంలో నిలవటం అభినందనీయం

-కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపిన బిజెపి ఓబీసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ సభ్యులు

హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త: కేంద్ర మంత్రుల పనితీరు గ్రేడింగ్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి నెంబర్ వన్ ర్యాంక్ సాధించటం అభినందనీయమని బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ సభ్యులు పెరిగ సురేష్ కొనియాడారు. ఈ మేరకు శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి, కిషన్‌రెడ్డికి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ మంత్రి వర్గంలో కిషన్‌రెడ్డి నెంబర్ వన్ స్థానంలో ఉండటం ఆయన పరిపాలనా నైపుణ్యానికి, అంకిత భావానికి నిదర్శనమని అన్నారు. దేశాభివృద్ధి లక్ష్యంగా ప్రధాని మోదీ చేపట్టిన వికసిత భారత్ సంకల్ప సాధనలో కిషన్‌రెడ్డి సమర్థవంతంగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నారని, తెలంగాణ గర్వించదగిన నాయకుడిగా, అంకిత భావంతో సేవలందిస్తున్న కిషన్‌రెడ్డి పేరు దేశవ్యాప్తంగా నిలిచిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంక ర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం ఛీఫ్ ఎన్.వి.సుభాష్ తదితరులు పాల్గొని కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా జాతీయ సభ్యులు పెరిగ సురేష్

భారతీయ శాస్త్రీయ కళల వైభవం నృత్యసంగీత సమ్మేళనం

నాంపల్లి, మే 30 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ కళల వైభవానికి ప్రముఖ నాట్యాచారిణి యశస్వినిశ్రీ నేతృత్వంలో ఉషాణ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు నేత్రపర్వంగా కావించిన విశిష్ట సాంస్కృతిక ప్రదర్శనలు నృత్య సంగీత సమ్మేళనం విజయవంతంగా నిర్వహించబడింది. సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ఘనంగా జరిగాయి. వివిధ అంశాలతో సాగిన సంగీతం, నృత్యం భారతీయ శాస్త్రియ కళారూపాల సమ్మేళనంగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సమ్మేళనంలో కర్ణాటక సంగీత సంప్రదాయ రీతిలో వివిధ రాగాలు, తాళాలు, సంగీత కృతులతో కూడిన ప్రత్యేక ప్రదర్శనలు కూచిపూడి నృత్యశైలిలో సమన్వయం చేస్తూ విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు వీనులవిందు చేశాయి. కర్ణాటక సంగీతంలోని భావం, లయ, రాగ వైభవం కూచిపూడి నాట్యంలోని ఆంగికాభినయం, సాత్వికాభినయం, నృత్త భంగిమలతో మిళితమై ఆహుతులైన కళా ఔత్సాహిక ప్రేక్షకులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక దివ్యానుభూతిని అందించాయి. నాట్యాచారిణి యశస్వినిశ్రీ నట్టువాంగం, సంజన గాత్రం, వరుణ్ రవిచందర్ మృదంగం, గణేష్ ఆనంద్ వయోలిన్‌తో అద్భుత వాద్యసంగీతాన్ని అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ నృత్య సంగీత సమ్మేళనం యువకళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చిన ఒక మహత్తర వేదికగా అలరించింది.

సంగీత నృత్యసమ్మేళనంలో ప్రదర్శనలిచ్చిన చిన్నారి కళాకారులు

సిఎం చొరవతోనే జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారం : మొగుళ్ళ రాజిరెడ్డి

హైదరాబాద్, మే 30 ప్రభాతవార్త :
సిఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. సంజీవరెడ్డినగర్ జలమండలి డివిజన్ కార్యాలయంలో శనివారం జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి త్రిశూలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల హక్కులను గౌరవిస్తూ, జలమండలిలో గుర్తింపు సంఘం ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తుందని, ఐఎన్‌టీయూసీ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని, జలమండలి యాజమాన్యంతో చేర్చించి లీవ్ ఎన్కష మెంట్, ఉద్యోగులకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన క్యాష్ ఇన్సెంటివ్, యూనిఫామ్, ఓటీ కంపెన్సేషన్, జనరల్ ట్రాన్స్ సెక్షన్ టు సెక్షన్ ఇబ్బంది కాకుండా ట్రాన్స్ సీనియర్ అసిస్టెంట్ పి ఎ, ఎఫ్ ఎ టూ ఆఫీసర్ ప్రమోషన్స్, ఇన్ ఆపరేటివ్ పాన్, ఆధార్ వల్ల 3 కోట్ల పైచిలుకు చిన్న స్థాయి ఉద్యోగులపై భారం పడకుండా మాఫీ వంటి అనేక సమస్యలు తన నేతృత్వంలో యూనియన్ పరిష్కరించబడ్డాయని తెలిపారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం జలమండలి కార్మికుల ఏఒక్క సమస్యను పరిష్కరించలేదని, బిఆర్ఎస్ అనుబందంగా ఉన్న వాటర్ వర్క్స్ కంగారు యూనియన్ అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ ఏఒక్క సమస్యను పరిష్కరించకుండా జలమండలి కార్మికులకు మోసం చేసాడని,ఆయనను చిత్తుగా ఓడించాలని అయన కోరారు. జూన్ 6న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని రాజిరెడ్డి కోరారు. ఈ సభలో ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు జి. సత్యజిత్‌రెడ్డి, టీజేఈయూ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవాన్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ ఈ.చంద్రశేఖర్, మేవ అధ్యక్షుడు సయ్యిద్ అక్తర్‌అలీ, ఏఐటీయూసీ నాయకులూ రమేష్, యూనియన్ నాయకులు బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మొగుళ్ళ రాజిరెడ్డి

బాగ్ లింగంపల్లి విఎస్టి వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో
ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం పని చేస్తానని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) అధ్యక్షుడు మొగుళ్ళ రాజి రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బాగ్ లింగంపల్లి విఎస్టి వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజి రెడ్డి నేతృత్వంలో త్రిశూల్ గుర్తు ఎన్నికల నిర్వహణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్, జలమండలి యూనియన్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ బొంతు రామ్మోహన్‌తో పాటు పెద్ద సంఖ్యలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగ ప్రతినిధులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళలే టార్గెట్..

చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు

కుత్బుల్లాపూర్, మే 30, ప్రభాతవార్త
ఉదయం వేళ వాకింగ్కు వెళ్లే ఒంటరి మహిళలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ చైన్ స్నాచింగ్, దోపిడీ ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. జీడిమెట్ల, సీసీఎస్ కుత్బుల్లాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఓ బాలుడు సహా నలుగురు సభ్యులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన బంగారు గొలుసు, ఆటో, స్కూటర్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి శనివారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 26న ఉదయం 5 గంటల సమయంలో చింతల్‌కు చెందిన శ్రీలత అనే మహిళ బీరప్ప నగర్ నుంచి కుత్బుల్లాపూర్ వైపు జీహెచ్‌ఎంసీ కార్యాలయం సమీపంలో వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి ఓ ఆటో వచ్చింది. అందులో ఉన్న ఓ వ్యక్తి కిందకి దిగి ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసును, మొబైల్‌ను బలవంతంగా లాక్కొన్నాడు. ప్రతిఘటించిన ఆమెపై దాడి చేసి స్వల్ప గాయాలపాలు చేశాడు. ఆ సమయంలో ఆటోలో మొత్తం ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీఎస్ కుత్బుల్లాపూర్, జీడిమెట్ల క్రైమ్ టీమ్‌తో కలిపి 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, పాత నేరస్తుల చరిత్ర, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను ఎల్లమ్మబండలోని సిక్కు బస్తీలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను గోవింద్ సింగ్ అలియాస్ డాంక్ గోవింద్ సింగ్ (24), కరణ్ సింగ్ అలియాస్ భువాని కరణ్ సింగ్(21), హర్దీప్ సింగ్(19)తో పాటు ఒక బాలుడిగా పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితులపై గతంలో కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. వీరి నుంచి దొంగిలించిన 2 తులాల బంగారు గొలుసు, ఆటో, హోండా డియో స్కూటర్, మొబైల్ ఫోన్ (మొత్తం విలువ రూ.5 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ బాల గంగిరెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగేంద్రరావు, జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ మల్లేష్, ఇతర ఎస్సైలు, కానిస్టేబుల్ సిబ్బందిని కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎస్. కోటిరెడ్డి (ఐపీఎస్) ప్రత్యేకంగా అభినందించారు.

మొక్కలు నాటిన ఆదాయపు పన్ను శాఖ అధికారులు

ఇన్‌కంటాక్స్ కాలనీలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సురేష్ బట్టిని.

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః
బంజారాహిల్స్ రోడ్ నెం.10, 12లో ఉన్న ఆదాయపు పన్ను కాలనీలలో ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ స్థాయిలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, సమాజ సంక్షేమం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏపీ, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ సురేష్ బట్టిని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (ఇన్వెస్టిగేషన్) రాజర్షి ద్వివేది, కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (అడ్మిన్ అండ్ టీపీఎస్) సరిష్ కుమార్ ఇరుకుల్లతో పాటు శాఖకు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ బట్టిని మాట్లాడుతూ కాలనీల్లో నివసించే చిన్నారులు, వృద్ధులకు ఉపయోగపడే విధంగా పండ్ల చెట్లను ఎక్కువగా నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు పోషకాహార ప్రయోజనాలు అందించేలా పచ్చదనాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ బాధ్యతను ప్రోత్సహిస్తూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, స్థిరమైన పచ్చని వాతావరణాన్ని అందించాలనే ఆదాయపు పన్ను శాఖ సంకల్పానికిఈకార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని అధికారులు అన్నారు.

బంజారాహిల్స్‌లో 46 గ్రాముల గంజాయి స్వాధీనం

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః
బంజారాహిల్స్ లోని భోలా నగర్ ప్రాంతంలో చరస్ మాదకద్రవ్యాన్ని వినియోగిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 46 గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం, బంజారాహిల్స్ భోలా నగర్ సమీపంలో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు, ఒక అనుమానితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెంది భోలానగర్‌లో నివసిస్తున్న షేక్ ఆరిఫ్ అబ్దుల్ సలీమ్ అలియాస్ దావూద్ అలియాస్ దావూద్ ఖురేషి (28)గా గుర్తించారు. మహారాష్ట్రలోని పరభణి ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి రూ.12 వేలకు సుమారు 46 గ్రాముల చరస్ కొనుగోలు చేసినట్లు నిందితుడు విచారణలో అంగీకరించాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్ లో పోలీసులు చరస్‌ను గుర్తించారు. అతని నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలో ఒకరు అరెస్ట్, నగదు స్వాధీనం

గోషామహల్,మే30ప్రభాతవార్త: చట్ట విరుద్ధంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠాలోని ఒకరినిఅరెస్ట్,చేసి నగదుతోపాటు సెల్‌ఫోను గోషామహల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం... బేగంబజార్ నారాయణ్‌భవన్‌లో అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు.అందులో వేణుగోపాల్‌శర్మఎలియాస్ ఇడ్లీ వేణును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఇతడు తనిఖీ సమయంలో నిందితుడు వాట్సాప్,ఇతర కమ్యూనికేషన్,మాధ్యమాల ద్వారా బెట్టింగ్ కార్యకాలాపాలు నిర్వహిస్తూ పట్టుబడ్డాడు.ఇడ్లీ వేణు గోదావరి అసోసియేషన్ పేరుతో క్రికెట్ బెట్టింగ్,రేస్‌కోర్సు బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నట్లు అంగీకరించినట్లు చెప్పారు.మధ్యవర్తుల ద్వారా పంటర్ల నుండి బెట్టింగ్ సొమ్మును వసూలుచేస్తున్నట్లు అంగీకరించారు.అంతేకాకుండా సాక్ష్యాలను దాచడానికి బెట్టింగ్ సంబంధించిన వాట్సాప్ చాట్‌లను కూడా డీలిట్ చేసినట్లు పోలీసుల విచారణలో తెలింది.చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలోకూడా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న కేసుల్లో నిందితుడన్నారు .అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కుతరలించారు.ఈ కేసును గోల్కొండ జోన్ డిసిపి జి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఎ.సి.పి.కె.చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా ప్రజలకు గోషామహల్‌పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడే ఆటగాళ్ల నిర్వాహకులు,ప్రోత్సాహించే వ్యక్తులపైకఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ఆన్‌లైన్ కార్యకాలపాలనునిరంతరం గమనిస్తూ,బెట్టింగ్ వల్ల వచ్చే నష్టాలు,చట్టపరమైన చర్యలపై కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ప్రజలు,ముఖ్యంగా యువకులు బెట్టింగ్ లేదా జూదా క్రీడాల్ల పాల్గొనవద్దని,ఇటువంటి చట్ట విరుద్ధమైన పనుల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలుపాలని కోరారు.

కళావైభవం విరసిల్లిన కురుగంటి నృత్యోత్సవం

మనస్విత నృత్యప్రదర్శనలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, మే 30 ప్రభాతవార్త :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కురుగంటి కళాక్షేత్రం, కురుగంటి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ 29వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని సంస్థ శిష్యులచే ప్రదర్శింపబడిన నృత్యోత్సవం కళావైభవాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి తంగిరాల నరేష్, కమల్, ఝాన్సీ రామ్, కురుగంటి రాధిక తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి నృత్యోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కురుగంటి కళాక్షేత్రం, చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులు సుమారు 50మందిచే కూచిపూడి నృత్యశైలిలో ప్రదర్శింపబడిన ఆనందన నర్తన గణపతిం, శివతాండవ స్తోత్రం, దశావతారశబ్దం, అన్నమయ్య కీర్తనలు, కూచిపూడి కథక్ జుగల్బంది నృత్యాలు సభికులను ఎంతగానో ఆహ్లాదపరిచి కళాప్రపంచంలో విహరింపజేశాయి. సభకుముందు డా. ఎం.మనస్విత, కె.శాన్వి, పి.నీహారిక నృత్యప్రదర్శనలు వీక్షకులను తన్మయుల్ని చేశాయి.

బోయిన్ పైజాన్ స్కూల్ రహదారి ఏర్పాటుకు సర్వే

బోయిన్‌పల్లి ప్రధాన రహదారిలో సర్వే నిర్వహిస్తున్నకంటోన్మెంట్ ఇంజనీర్లు రాజేశ్వర్,బోర్డు మాజీ వి.పి. జంపనప్రతాప్

కంటోన్మెంట్,మే 30 ప్రభాతవార్త:
బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ప్రధాన రహదారి నుంచి పైజాన్ హై స్కూల్ వరకు రహదారి నిర్మాణం విషయంపై సర్వే నిర్వహించాలని బోర్డు సిఈఓ అరవింద్‌కుమార్ ద్వివేది ఆదేశాల మేరకు శనివారం బోర్డు ఇంజనీర్ రాజేశ్వర్, మాజీ వి.పి. జంపనప్రతాప్,ముస్లిం బోర్డు పెద్దలతో కలిసి సర్వే నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి న్యూ బోయిన్‌పల్లిలోని పైజాన్ హై స్కూల్‌కు మిలటరీ క్వార్టర్స్‌లోనికి రహదారి గుండా రాకపోకలు సాగించే వారు కరోనా సమయంలో మిలటరీ అధికారుల క్వార్టర్స్ మీదుగా పాఠశాలకు వెళ్లే రహదారిని మూసివేశారు.దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డికి విన్నవించుకోగా సిఈఓ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం బోర్డు అధ్యక్షుడు రెహమాన్, షకీబ్,ఖాదర్ పాషా పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

అత్తాపూర్ మే30,ప్రభాతవార్త :
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ గా పని చేస్తున్న హరి సింగ్, డ్రైవర్ గా పని చేస్తున్న ఈ. లక్ష్మీ నారాయణ లు ఈ నెల 31 వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనం కమిటీ హాల్‌లో వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.దీనికి ముఖ్య అతిధిగా హాజరు అయిన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ వారిద్దర్నీ సన్మానించారు.సుదీర్ఘ కాలం వారిద్దరూ విశ్వవిద్యాలయానికి అందించిన సేవలని కొనియాడారు. ప్రతి ఉద్యోగి తన విధులని నీతి, నిజాయితీ లతో నిర్వర్తించినపుడే వ్యక్తి గత పురోగతి, సంస్థ పురోగతి సాధ్యం అవుతుందని రిజిస్ట్రార్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బోధన, బోధనేతర సిబ్బంది హరిసింగ్, లక్ష్మి నారాయణ లతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.వారు విశ్వ విద్యాలయానికి అందించిన సేవలని అభినందించారు. అదేవిధంగా నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్లో సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వలిహుస్సేన్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలి హుస్సేన్ ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తో పాటు గ్రంథాలయ సిబ్బంది, శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు.

నల్లకుంట శంకర్ మఠం ఆవరణలో మజ్జిగ పంపిణి

చిక్కడపల్లి మే 30 (ప్రభాతవార్త) :
ప్రజలందరూ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రముఖ సంఘసేవకులు నైషధం నైషధం సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం వాకర్స్ క్లబ్, అవోపా హైదరాబాద్, గాయత్రి మహిళా వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నల్లకుంట శంకర్ మఠం ఆవరణలో ఏర్పాటు చేసిన కొర్ర ఉప్మా, అంబలి, రాస్నా, మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఏ.రామలింగేశ్వర రావు, నిమ్మల రాజశేఖర్, అంజియాదవ్, ఐలినేని కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కాళేశ్వర పుష్కరాల్లో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,మే 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలు అయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకొని తెల్లవారు జామున శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో ఆయన దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. సరస్వతీ నదుల త్రివేని సంఘం వద్ద శుక్రవారం రాత్రి పుణ్యస్నానం అచరించారు.

ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలి

అడ్డగుట్ట టీయూ జేఏసీలో మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

అడ్డగుట్ట,మే 30 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలని టీయూ జేఏసీ కన్వీనర్ సుల్తాన్ యాదగిరి తెలిపారు. శనివారం అడ్డగుట్టలో నిర్వహించిన టీయూ జేఏసీ రాష్ట్ర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ కోసం అనేక పోరాటాలు,ఉద్యమాలు చేసిన ఉద్యమ కారులను గుర్తించి వారికి 50 సబ్సిడితో కోటీ రూపాయల రుణం ఖవ్వాలని,ప్రమాద దీమా కింద రూ.25 లక్షలు ప్రకటించాలన్నారు. టీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు గాజుల యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శోభా రాణి, మాచెర్ల శ్రీనివాస్.కె.సత్య, డి.వెంకటలక్ష్మి, అనుముల రవిందర్, చంద్రకళ, చంద్రమౌళి, గడ్డం నర్సింగ్,కమలా, పద్మ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం ఐదవ వార్షికోత్సవ వేడుకలు

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల

కెపిహెచ్‌బి కాలనీ, మే 30, ప్రభాతవార్త

శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని శివమ్మ కాలనీ రామాలయం ఐదోవ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామి మహోత్సవ ఉత్సవాలకు ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ రాంచందర్, వైస్ చైర్మన్ కె.నరసింహులు, ట్రెజరర్ సిద్దయ్య, గిరి, సతీష్, కృష్ణ, మన్యం, చారి, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి : ఎమ్మెల్యే కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 30, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గం కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానిక నిరుపేదలకు అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గంకు చెందిన విలేకరులకు కేటాయించాలని కోరుతూ శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అమృత నగర్ తండావాసులకు 62 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించామని అలాగే మిగిలినవి స్థానికులకు కేటాయిస్తూ పత్రికా విలేకరులకు కేటాయించాలని కలెక్టర్‌ని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు ఎన్. శ్రీనివాసరావు (తులసిరావు) పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-ఎస్‌హెచ్‌ఓ సురేష్ కుమార్

బేగంపేట మే 30,ప్రభాతవార్త

సైబర్ నేరాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాంగోపాల్‌పేట ఇన్స్‌పెక్టర్ బి.సురేష్ కుమార్ హెచ్చరించారు.శనివారం రాంగోపాల్‌పేట పరిధిలోని యాత్రి నివాస్ హోటల్ పిన్ కోడ్ లో సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు సామాన్యులను ఏ విధంగా మోసం చేస్తున్నారో,వాటి బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ సందర్భంగా వివరించారు.గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని సూచించారు.ఒక వేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్ కు ఫిర్యాదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై నర్సింగరావు,ఉమెన్ ఎస్సై గాయత్రిదేవీ,పెట్రోలు కార్ బీసీ 1సిబ్బంది సైబర్ వారియర్ హెడ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పిన చోట నీరు పోయలేదని ట్యాంకర్ డ్రైవర్‌పై దాడి

నార్సింగి, మే 30 ప్రభాతవార్త : మణికొండ క్వార్టర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి జల మండలి సరఫరా చేస్తున్న ట్యాంకర్‌ను క్యాన్ నెంబర్ ఆధారంగా బుక్ చేసుకున్నాడు. క్యాన్ నెంబర్ చిరునామా ప్రకారం జల మండలి ట్యాంకర్ డ్రైవర్ సాయి మణికంత అక్కడికి వెళ్లి నీటిని పోసేందుకు సిద్ధమయ్యాడు. కానీ బుక్ చేసుకున్న వ్యక్తి ఇక్కడ కాదు మరోచోట నీరు పోయాలని డ్రైవర్‌కు సూచించాడు. తాను అలా చేయలేనని, తనకు అధికారులు అందజేసిన చిరునామాలోనే పోస్తానని డ్రైవర్ తెలిపాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకున్న వ్యక్తి డ్రైవర్ ముఖంపై దాడి చేశాడు. దీంతో డ్రైవర్ ముఖం నుంచి పెద్ద ఎత్తున రక్తస్రావం అయ్యింది. దీంతో స్థానికులు గమనించి, దాడిని అడ్డుకున్నారు. ఈ దాడిని నిరసిస్తూ జల మండలి వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లంతా నీటి సరఫరాను నిలిపివేసి ధర్నా చేశారు. ట్యాంకర్ డ్రైవర్‌పై దాడిని స్థానికులు ఖండించారు. ఇలాంటి దాడులు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

దేవి దేవాలయంలో ముగిసిన అఖండ తాళ సప్తాహం

- భక్తిశ్రద్ధలతో కాగడ హారతి

- ఉత్సాహంగా గోపాల్ కాల

తెల్లవారు జామున పాండురంగ విఠలేశ్వరునికి కొవ్వొత్తులతో కాగడ హారతి ఇస్తున్న భక్తులు

చాంద్రాయణగుట్ట, మే 30, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట దేవి దేవాలయంలోని శ్రీ పంచాయతన బాల విశ్వేశ్వరస్వామి ఉపాలయ ప్రాంగణంలో శ్రీ పాండురంగ విఠలేశ్వర్ అఖండ 34వ తాళ సప్తాహ మహోత్సవం - 2026 భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసింది. గత ఎనిమిది రోజులుగా జరిగిన తాళ సప్తాహంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భజన మండళ్లు ఆలపించిన భజనలు, భక్తి గీతాలతో చాంద్రాయణగుట్ట పరిసరాలలో ఆధ్యాత్మిక వాతావరణం తొనికిసలాడింది. భక్తులు తన్మయత్వంలో పాండురంగని స్మరిస్తూ గడిపారు. శనివారం తెల్లవారు జామున ఆశేష సంఖ్యలో హాజరైన భక్త జనుల మధ్య గ్రామ పురోహితులు గోళ్ళ నరహరి శర్మ, ఎ.విజయ్ కుమార్, దేవి దేవాలయం ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ల ఆధ్వర్యంలో నేత్రపర్వంగా కాగడ హారతి నిర్వహించారు. భక్తులు కొవ్వొత్తులతో స్వామి కాగడ హారతిలో పాల్గొన్నారు. అనంతరం ఏడు రోజులుగా నిర్వహిస్తున్న నిరంతర అఖండ తాళ సప్తాహం పరిసమాప్తమైయ్యింది. ఆ తరువాత అందంగా తీర్చిదిద్దిన పల్లకిలో పాండురంగ విఠలేశ్వరుని ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తుల కేరింతల మధ్య గోపాల్ కాల (ఉట్టి కొట్టటం) ఉత్సహంగా సాగింది. ఉట్టి కోట్టేందుకు భక్తులు పోటీ పడ్డారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. దేవి దేవాలయం ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ దంపతులు నిర్వాహకులు గౌని అజయ్ కుమార్ గౌడ్ దంపతులను శాలువ, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి ఆశ్వీరచనాలు పలికారు. గౌని ప్రభు లింగం గౌడ్, గౌని అజయ్ కుమార్ గౌడ్ల ఆధ్వర్యంలో జరిగిన అఖండ తాళ సప్తాహంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైయ్యారు.

కుండతో నీళ్లు తెచ్చి ఖర్మ కాండలు

..చేతి పంపు మాయం కావడంతో ఇబ్బందికర పరిస్థితి

బేగంపేట మే 30,ప్రభాతవార్త

నగరం నడిబొడ్డున ఉన్న బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ పర్ల్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే దారిలో కుడివైపు ఖాళీ స్థలంలో ఉన్న చేతి పంపు ఇటీవల కాలంలో గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు.అయితే అది ఎవరు తొలగించారు అన్నది తెలియక బస్తీ వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.శుక్రవారం శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై బస్తీకి చెందిన పోట్ల లావణ్య హఠాన్మరణం చెందారు.దీంతో బస్తీవాసులు సమీపంలోని పర్ల్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న బోరు వద్ద ఖర్మ కాండలకు ముందు స్నానం చేసుకోవాల్సి ఉంది.అయితే ఇటీవల బోరు ను గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ లేకుండా తొలగించడంతో శుక్రవారం స్థానికులు కుండతో నీటిని తెచ్చుకుని స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది.ఈ ప్రాంతంలో ఉన్న బోరు రాత్రికి రాత్రి మాయం కావడంతో బస్తీ వాసులు ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇదే విషయాన్ని ప్రభాత వార్తలో బోరు మాయం అన్న కథనాన్ని ప్రచురితం చేసింది.బస్తీలో ఎవరైనా చనిపోతే ఈ బోరు వద్దే స్నానాలు చేసుకుని ఖర్మ కాండలు నిర్వహించుకుంటారు.అయితే ఇటీవల కొద్ది రోజుల క్రితం ఆ బోరును గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది.బస్తీలో ఎవరైనా చనిపోతే ఇక్కడ (చేతి పంపు) వద్దే స్నానం చేయాల్సి ఉంది.ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ సమస్యపై జోక్యం చేసుకుని మాయమైన బోరు స్థానంలో కొత్త బోరు వేయించేలా చర్యలు చేపట్టాలని శ్యాంలాల్ బిల్డింగ్ బస్తీ వాసులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయండి

: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, మే 30 ప్రభాతవార్త:

ప్రజావసరాలు మేరకు చేపడుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులదే అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తుర్కపల్లి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలులో 45.50 లక్షలు వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు కనీస వసతులు కల్పించడం తన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో 40లక్షలు వ్యయంతో చేపట్టిన నాలా పూడికతీత పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. నైరుతీ పవనాలు వచ్చే లోపు నాలా పూడికతీత పనులను యుద్ద ప్రాతిపదికతన పూర్తి చేయాలని కోరారు. అవసరమైన చోట బాక్స్ డ్రైన్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం తుర్కపల్లిలోని ముస్లిం స్మశాన వాటికను పరిశీలించిన ఎమ్మెల్యే మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ వెంకటేశ్వర్లు, డిఇ మహేష్, ఎఇలు రవళి బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, డోలి రమేష్, పరమేష్, శోభన్, శరణ్ గిరి, శ్రీదేవి, వర్ష, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలు మేరకు అభివృద్ధి



వినతి పత్రం స్వీకరిస్తున్న జితేందర్‌నాథ్

అల్వాల్, మే 30 ప్రభాతవార్త: కాలనీలులో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం సాయిబాబ కాలనీకి చెందిన ప్రతినిధులు ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్లు పనులు పూర్తి చేసినందుకు జితేందర్‌నాథ్‌ను వారు సన్మానించారు. మ్యాన్‌హోల్స్, బిటి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని మాజీ కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

రాబోయేది బిజెపి ప్రభుత్వమే : ఎంపి లక్ష్మణ్



చిక్కడపల్లి , మే 30 (ప్రభాతవార్త) :

తెలంగాణలో రాబోయే బీజేపీ ప్రభుత్వమేనని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాజ్యసభహౌస్ కమిటీ చైర్మన్ గా లక్ష్మణ్ నియమితులైన సందర్భంగా శనివారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి ఆధ్వర్యంలో డాక్టర్ కె.లక్ష్మణ్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారవర్గాలు దేవమతున్నడని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రజలు బీజేపీ వైపు మొగ్గు రూపుతున్నావచ్చారు. త్వరలో జరుగురున్న జీహెచ్ఎంచ్చిది. ఎన్నికల్లో సైతం బీజేపీ అభ్యర్థులు బాణీ మోజాతో గెలవడం కాయ మని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మీ సిబ్బంది పిల్లలకు చేయూత :అమిత్‌కుమార్

తిరుమలగిరి ఆకాశ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న దృశ్యం

కంటోన్మెంట్,మే 30 ప్రభాతవార్త:

భారత సైన్యంలో విశేష సేవలు అందిస్తున్న పారామిలటరీ దళాలు,ఆర్మీ సిబ్బంది పిల్లలకు పోటీ పరీక్షల నిమిత్తం శిక్షణ తీసుకున్న వారికి మద్ధతుగా స్కాలర్‌షిప్‌లు అందజేసేందుకు అకాశ్ విద్యా సంస్థ అండగా నిలుస్తుందని ఆ సంస్థ ప్రతినిధి అమిత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలగిరి చైరస్తాలోని ఆకాశ్ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత సైన్యంలో పనిచేసే సిబ్బంది పిల్లలకు చేయూత అందించడమే తమ లక్ష్యమన్నారు. పారామిలటరీ దళాలతో అవగాహన ఒప్పందలపై సంతకాలు చేసి దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

సీఐటీయు జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న జోన్ నేతలు

చాంద్రాయణగుట్ట, మే 30, ప్రభాతవార్త : సీఐటీయు చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. జోన్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ ఎస్.కిషన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులకై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం సీఐటీయు అన్నారు. దీర్ఘకాలీక సమస్యలపై, సమసమాజ నిర్మాణానికై పోరాటం చేస్తుందన్నారు. దేశంలో ఎన్ని సంఘాలు ఉన్నా తమ స్వార్థం కోసం పనిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. సీఐటీయు కార్మిక వర్గ సంక్షేమం కోసం నిరంతరం ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. అంబానీ, అదాని లాంటి పెట్టుబడి దారి వర్గం కోసమే ఆరాట పడుతుందని ఎద్దేవా చేశారు. నిరంతరం హక్కుల కోసం పోరాటం చేసే సీఐటీయులో కార్మికులు పెద్ద సంఖ్యలో చేరి తమ హక్కులు కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటియు నేతలు రాంకుమార్, అబ్బు, కొండల్, యాదయ్య, మహమూద్, గౌస్ పాల్గొన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించిన నార్సింగి అధికారులు



మంచిరేవులలో చెత్తవేసే ప్రాంతంను శుభ్రం చేసి చలివేంద్రంను ఏర్పాటు చేసిన నార్సింగి సర్కిల్ అధికారులు.

నార్సింగి, మే 30 ప్రభాతవార్త : నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవులలో స్థానికులు పెద్ద ఎత్తున చెత్త వేస్తున్నారు. పారిశుద్య విభాగానికి చెందిన అధికారులు ఇక్కడ చెత్తను వేయకూడదని పలుమార్లు స్థానికులకు సూచనలు చేశారు. హెచ్చరికలు జారీ చేశారు. కానీ పరిస్థితిలో మార్పు రావడం లేదు. దీంతో పారిశుద్యం ఇంచార్జి లచ్చిరాం శనివారం తన సిబ్బందితో చెత్తను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేయించారు. ఇక్కడ మళ్లీ చెత్త వేయకుండా ఉండాలని మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి సహకారంతో చలివేంద్రంను ఏర్పాటు చేయించారు. చెత్త వేసిన స్థలంలో చల్లటి మంచినీరు లభించడంతో స్థానికులు వచ్చి చల్లటి నీటిని తాగి వెళ్లారు. ఈ చలివేంద్రం ఏర్పాటుతో చెత్త సమస్య పరిష్కారం అయ్యిందని సర్కిల్ అధికారులు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, యువతలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా భారతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లో యాంటీ డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోస్టర్లను కాంగ్రెస్ పార్టీ సినియర్ నేత డా. రోహిణ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐవైసీ ప్రధాన కార్యదర్శి శశాంక్ రావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్, జవహర్ బాల్ మంచ్ చైర్మన్ సంగమేశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విష్ణు, యువ నాయకులు ముర్తుజా, బాబు, అమన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. రోహిణ్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు, సమాజ సేవ వైపు యువత దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం, పోలీసులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు యూత్ కాంగ్రెస్ తరపున అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు.

సిసిసిఎల్ ఛాంపియన్ వైకింగ్స్ పిసి

-తుదిపోరులో పెంగ్విన్ పిసిపై ఘన విజయం

గెలుపొందిన వైకింగ్స్ పిసి జట్టు

హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:

నగరంలో గత పది వారాలుగా క్రీడాభిమానులను అలరించిన సిసిపిఎల్ క్లబ్ లీగ్ అంతిమ విజేతగా వైకింగ్స్ పీసీ నిలిచింది. తుదిపోరులో 40తో పెంగ్విన్ పీసీపై ఘన విజయం సాధించింది. నగరంలోని 19 వేదికల్లో ప్రాథమిక స్థాయి మ్యాచ్‌లతో మొదలైన ఈ క్రీడా సంబరం, గండిపేట్‌లోని క్రాస్‌కోర్ట్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన స్టేట్ ఆఫ్ ది లీగ్ (ఫైనల్స్) పోరుతో ముగిసింది. ఉత్కంఠగా ఫైనల్స్ హోమ్ అండ్‌అవే పద్ధతిలో సాగిన ఈ టోర్నమెంట్‌లో కాన్ఫరెన్స్ ఎ ఫైనల్ మ్యాచ్‌లో డీఆర్‌సీ స్పోర్ట్స్ ఫౌండేషన్‌పై పెంగ్విన్ పీసీ 42 తేడాతో విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఇక కాన్ఫరెన్స్ బి ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను ఉత్కంఠ తీరాలకు తీసుకెళ్లింది. వైకింగ్స్ పీసీ, బిల్డ్ క్రూ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ 33 తో టై అయింది. దీంతో విజేతను నిర్ణయించడానికి నిర్వహించిన గేమ్ బ్రేకర్ రౌండ్‌లో వైకింగ్స్ పీసీ 25-22 తో విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. అదే జోరును కొనసాగిస్తూ జరిగిన ప్రధాన ఫైనల్ (స్టేట్ ఆఫ్ ది లీగ్) లో వైకింగ్స్ పీసీ 40 తేడాతో పెంగ్విన్ పీసీని చిత్తు చేసి సీసీపీఎల్ క్లబ్ లీగ్ ట్రోఫీని కైవసం చేసుకుంది.పది వారాల పాటు సాగిన ఈ లీగ్ నగరంలో రాకెట్ స్పోర్ట్స్‌కు ఉన్న క్రేజ్‌ను మరోసారి నిరూపించింది. మొత్తం 350 మందికి పైగా రిజిస్టర్డ్ అథ్లెట్లు ఈ టోర్నీలో బరిలోకి దిగగా, అందులో 92 మంది మహిళలు ఉండటం విశేషం. ఆటగాళ్లకు 220కి పైగా మ్యాచ్‌లు ఆడే అవకాశాన్ని కల్పించిన ఈ లీగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు 8 వేల మందికి పైగా క్రీడాభిమానులు తరలివచ్చారు. టోర్నీ ఘన ముగింపుపై సెంటర్ కోర్ట్ స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ వ్యవస్థాపకులు యశ్వంత్ బియ్యాల, విక్రాంత్ రావు హర్షం వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్, ప్రతిభావంతులైన యువ ఆటగాళ్ల కలయికతో లీగ్ ప్రమాణాలు అద్భుతంగా పెరిగాయని, హైదరాబాద్ క్రీడా సమాజానికి ఈ టోర్నీ మంచివేదికగా నిలిచిందని పేర్కొన్నారు.

ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలో నిలిచిన మురుగు నీటి కాలువ పనులు

-ఎఎంసికి వినతిపత్రం అందించిన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నసీరుద్దీన్

బేగంపేట మే 30,ప్రభాతవార్త

అమీర్‌పేట సర్కిల్ ఏఎంసీ నాగార్జునకు వినతి పత్రం అందిస్తున్న నసీరుద్దీన్.

బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో కొద్ది రోజులుగా నిల్చిపోయిన మురుగు నీటి పైప్ లైన్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతూ సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నసీరుద్దీన్ (అడ్డు) నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు,స్థానికులు అమీర్‌పేట సర్కిల్ ఏ ఎం సీ నాగార్జునను కల్సి వినతి పత్రం అందజేసారు.అనంతరం నసీరుద్దీన్ మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట నీలిమ నేతృత్వంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని కోరామన్నారు.అలాగే ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో ప్రారంభించిన మురుగు నీటి కోసం వేస్తున్న పైప్ లైన్ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరామన్నారు.నిల్చిపోయిన పైప్ లైన్ పనుల కారణంగా రాత్రి సమయంలో వృద్దులు పడిపోతున్నారని,వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారిందని,బస్తీ వాసులు కొందరు పైప్‌లైన్ కోసం తీసిన గుంతలలో చెత్తా చెదారాన్ని పడవేస్తున్నారని, దోమల వ్యాప్తి ఎక్కువైందని,దీని దృష్టిలో ఉంచుకోని పైప్‌లైన్ పనులను వీలైనంత వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఏఎంసీని నసీరుద్దీన్ (అడ్డు) కోరినట్లు తెలియజేసారు.పనులను వీలైనంత వేగంగా పూర్తి చేస్తామని ఏఎంసీ హామీ ఇచ్చినట్లు నసీరుద్దీన్ తెలియజేసారు.

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో బండి రమేష్

గాంధీభవన్లో జరిగిన సమావేశంలో పాల్గొన్న రండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మే 30, ప్రభాతవార్త

గాంధీ భవన్ ప్రాంగణంలో ఉన్నటువంటి ఇందిరా భవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఏఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్, ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్‌ల ఆధ్వర్యంలో శనివారం జరిగిన మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ ఏజెంట్లను, అన్ని డివిజన్లకు అధ్యక్షులను, ఇతర అనుబంధ సంఘాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు.పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామస్థాయి నుండి సంస్థగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన సలహాలు సూచనలను సమావేశంలో వివరించారు.కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బిఎల్ఎల నియామకాలపై నిర్వహించిన సమావేశాలపై పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్‌లకు పూర్తి స్థాయి నివేదికను అందించి పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

LOSS OF DOCUMENT

The general public are hereby informed that, my client **Smt. Mekala Jyothi W/o. Late Mekala Madhusudhan Rao** R/o. Bharath Nagar, Uppal, Medchal District, had lost original document i.e., Regd. Sale Deed vide Document No. 3183/1992, dt., 20-04-1991, registered before SRO Uppal, pertaining to open plot No.367 and 368 parts in Sy.Nos. 1088, 1115 & 1116, admeasuring 200 Sq.yards or 167.2 Sq.Mts., situated at Ghanpur Village, Ghatkesar Mandal, Medchal Malkajgiri District. Previously Edulabad Village and Grampanchayath, Ghatkesar Mandal, R.R. District bounded by: North : Plot No.369 and 370 parts South: 25' wide Road East: Plot No.368 part and West : plot No.367 part, which is stands in the name of her Father-in-law, late. Mekala Balaiah, as my client is legal heir and successor of above said property, as the Mekala Balaiah died on 2-6-2007 and husband of my client Mekala Madhusudhan Rao S/o. late M. Balaiah also died on 26-7-2015. As such in the event of any person may found kindly return the same to my client or his counsel, in spite of may misuse the said document my client may initiate criminal action against them. Apart from that my client is going to lodge a complaint before concerned SHO, Uppal, in regard to loss of documents.

M/s. GAJJALA SRINIVAS REDDY
Advocates,
Plot No. 23/1, Balaji Nagar,
B.N. Reddy Colony, Sagar Road,
Vanasthalipuram, Hyd-79
Cell No. 9391020405

అడ్వకేట్ ఖాజామొయినుద్దీన్ కుటుంబసభ్యులకు కెటిఆర్ పరామర్శ



హైదరాబాద్ మే 30 ప్రభాతవార్త

ఇటీవలే నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యకు గురైన అడ్వకేట్ ఖాజా మొయినుద్దీన్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఖాజా మొయినుద్దీన్ నివాసానికి వెళ్లిన కేటీఆర్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటీవలే నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసబ్ ట్యాంక్‌లో అడ్వకేట్ ఖాజా మొయినుద్దీన్ దుండగుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఖాజా మొయినుద్దీన్ కుమారుడు ఫర్హాన్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేటీఆర్ వెంట ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ నెం: 02/DD/VET/KBZ/GHMC/2026 తేదీ: 30.05.2026

ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా క్రింది వాటి సరఫరా కోసం ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడాయి. క్ర.సం.1. పనిపేరు: GHMC ఖైరతాబాద్ జోన్ జంతు సంరక్షణ కేంద్రానికి ఆహార పదార్థాలు, వీధి జంతువులను పట్టుకునే పరికరాలు, శుభ్రపరిచే ఏజెంట్లు మరియు ఇతర వినియోగ వస్తువుల సరఫరా (ఐటమ్ నెం.1). అంచనా (రూ.లో): 39,92,403/-. ఈవెంట్లు: తేదీ మరియు సమయం : 01.06.2026 నుండి 05.06.2026 వరకు. తదుపరి వివరాల కోసం https://www.tender.telangana.gov.in ను దర్శించండి.

సం/-. డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ), ఖైరతాబాద్ జోన్, GHMC.

DIPR.NO.3329-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 30.05.2026

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
EE-II (56-కొంపల్లి, 59-దుండిగల్ & 60 మేడ్చల్) కుత్బుల్లాపూర్ జోన్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT Nos 08/07/07/EE-56/59/60/QBZ/CMC/2026-27, తేది: 30.05.2026. 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం పై ప్రచురింపబడినది. వివరాలను https://tender.eprocurement.gov.in లాగింగ్ ద్వారా చూడవచ్చును. క్రింద వివరంగా ఈవెంట్స్ తేదీ. పనిపేరు: 1. సిసి రోడ్స్ వేయుట- 3 పనులు, వీధి దీపాల నిర్వహణకు డ్రైవర్‌లు, AB కేబిల్ మరియు LED లైట్స్ యొక్క సేకరణ-3 పనులు. 2. 1 సిసి రోడ్ వేయుట-1 పని. 2) వీధి దీపాల నిర్వహణకు డ్రైవర్‌లు, AB కేబిల్, మరియు LED లైట్స్ యొక్క సేకరణ-3 పనులు. 3) కంపోస్ట్ గొయ్యి నిర్మాణం-1 పని. 4) విద్యుత్ బోర్స్ మరియు పంప్ సెట్స్ నిర్వహణ-1 పని. 5) PSCC స్తంభాల సంఖ్య 15 ఏర్పాటు-1 పని. 3) వీధి దీపాల నిర్వహణకు LED లైట్స్, AB కేబిల్స్, MCB, క్లాంప్ సెట్స్, బెండ్ పైప్స్ & నానా రకాల ఐటమ్‌లు-3 పనులు. అంచనా మొత్తం లక్షల్లో: మూడింటికి 69.70, 50.87, 14.36. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ మరియు సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ మరియు సమయం: 1. 02.06.2026 మ.12.00గం. నుండి 09.06.2026 మ.12.00గం. 2. క్ర.సం.1 పనుల కొరకు: 01.06.2026 మ.12.00గం. నుండి 08.06.2026 మ.12.00గం. క్ర.సం.2 నుండి 5: 02.06.2026 మ.12.00గం. నుండి 09.06.2026 మ.12.00గం. 3. 02.06.2026 మ.12.00గం. నుండి 09.06.2026 మ.12.00గం. అధికారి పేరు, చిరునామా, EE, సర్కిల్ 56, 59 & 60 CMC, కుత్బుల్లాపూర్, సెల్ నం: 7995468066, 7331181426. సంబంధిత అధికారి చిరునామా : శ్రీ సుబ్రమణ్య SVRNRD ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, CMC. తదుపరి వివరాలకు: ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-56, 59 & 60, QBZ, CMC.

DIPR.NO. 3266-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 30.05.2026

ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత: డైరెక్టర్ జగదీష్

మానస సరోవర్ ప్రాంతాన్ని సందర్శించిన హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుగ్గు జగదీష్ తదితరులు

మలక్ పేట, మే 30, ప్రభాతవార్త:
ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, తెలంగాణ ఆనియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దుగ్గు జగదీష్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుగ్గు జగదీష్ హైదరాబాద్ నగరం నుంచి పలువురితో కలిసి అత్యంత పవిత్రమైన, విశేషమైన మానస సరోవర్ యాత్రకు బయలుదేరి కైలాసగిరి ప్రాంతాన్ని సందర్శించడంతోపాటు పలు ప్రముఖ దేవాలయాలను సందర్శించి మానస సరోవర్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బిసి మహాసంకల్ప సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : గ్రేటర్ అధ్యక్షుడు శ్రీకాంత్

గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కావేటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీసీ మహాసంకల్ప సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు తదితరులు

మలక్ పేట, మే 30, ప్రభాతవార్త:
విజయవాడలో జూన్ 7 తేదీన నిర్వహించనున్న బీసీ మహాసంకల్ప సభ ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ జన చైతన్య సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కావేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంతంలో జాతీయ బీసీ జనచైతన్య సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కావేటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు బీసీ రమణ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్ .నరసింహ చారి, రాష్ట్ర కార్యదర్శి విప్లవ కుమార్, యువజన జాతీయ ప్రధాన కార్యదర్శి సుమన్ ఆచార్య తదితరులు విచ్చేసి బీసీ మహాసంకల్ప సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో జూన్ 7 తేదీ నాడు జరగనున్న బీసీ మహాసంకల్ప సభ విజయవంతం చేయాలని,అందరూ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవం

తుర్కయంజాల్ మే 30, ప్రభాతవార్త
ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ తొర్రూరు డివిజన్ల పరిధిలోని నాగార్జునసాగర్ రహదారి బ్రాహ్మణపల్లి చౌరస్తా ఆటో స్టాండ్ వద్ద సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ సిఐటియు జెండాను ఎగరవేసి కార్మికులతో కలిసి ఘనంగా ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ కార్మిక వర్గ ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) గత 55 ఏండ్లుగా పోరాటాలు కొనసాగిస్తోందని తెలియజేశారు.కార్మిక వ్యతి రేక విధానాలు, నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, పెట్టుబడి దారీ దోపిడీకి వ్యతిరేకంగా సీఐటీయూ నిరంతరం ఉద్యమిస్తోం దన్నారు. సీఐటీయూ 56వ వ్యవస్థాపక దినోత్స వాన్ని పురస్కరించుకుని శనివారం బ్రాహ్మణపల్లి చౌరస్తాలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి కార్మికులంతా ఉత్సాహంగా స్వీట్లు పంచుకున్నారు.1970 మే 30న కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ, శ్రమజీవుల సంక్షేమం, దోపిడీకి వ్యతిరేక పోరాటాల లక్ష్యంతో ఏర్పాటైందన్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా పారిశ్రామిక, అసంఘటిత, ప్రభుత్వ రంగ కార్మికులను ఐక్యం చేస్తూ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, కార్మిక చట్టాల అమలుకు కోసం సీఐటీయూ అనేక ఉద్యమాలు, పోరాటాలు చేపట్టిందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ మాధవరెడ్డి తుర్కయంజాల్ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు గుడ్ల వినోద్ కుమార్ ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి శేఖర్ రెడ్డి, ఆటో డ్రైవర్లు నాగరాజు, యాదగిరి, రామకృష్ణారెడ్డి, మహేష్, నరసింహ, బీరప్ప, యాదయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి : వైస్ చైర్మన్ ఆలం భాస్కర్

మున్నూరు కాపు సంక్షేమ సంఘం పరిషత్ వైస్ చైర్మన్ ఆలం భాస్కర్ ను సన్మానిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, మే 30, ప్రభాతవార్త:
మున్నూరు కాపులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంక్షేమ సంఘం పరిషత్ వైస్ చైర్మన్ ఆలం భాస్కర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంక్షేమ సంఘం పరిషత్ వైస్ చైర్మన్ గా నియమితులైన ఆలం భాస్కర్ ను ఓల్డ్ మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఆలం భాస్కర్ మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పందిరి రాము, రాజేష్ పటేల్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోండి... పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

నేరెడ్ మెట్,మల్కాజిగిరి కమిషనరేట్ , మే 30,ప్రభాతవార్త :
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీసు అధికారులను సీపీ సుమతి ఐపీఎస్ శనివారం కమిషనరేట్ కార్యాలయంలో సన్మానించారు. ఏసీపీ (క్రైమ్స్) కే. కరుణసాగర్, కంట్రోల్ రూమ్ ఎస్ఐ పి. బాలరాజు, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఎస్ఐ టి. ప్రభాకర్, సరూర్‌నగర్ ఉమెన్ పీఎస్ ఏఎస్ఐ మహ్మద్ అలీ, అంబర్‌పేట్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ఎస్ఐ ఎం. అంజిరెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జి. నరేందర్‌రెడ్డిలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో అంకితభావంతో, క్రమశిక్షణతో సేవలందించిన అధికారుల సేవలు ప్రశంసనీయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడపడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పెన్షన్, ఇతర ఆర్థిక వ్యవహారాల నిర్వహణలోనూ క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. పదవీ విరమణ పొందిన సిబ్బందికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) ఇందిరా, అడిషనల్ డీసీపీ శివకుమార్, సీఏఓ శ్రీనివాస్, ఏసీపీ రవీంద్రరెడ్డి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి, ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి

-జిల్లా విద్యాశాఖ అధికారికి ఎఐవైఎఫ్ వినతిపత్రం..
తుర్కయంజాల్ మే30,ప్రభాతవార్త
రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తూ భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయడం ఆందోళనకరమని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి పి. శివకుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాశాఖ అనుమతులు మరియు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా, కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ముందస్తుగానే అడ్మిషన్లు చేపట్టి తల్లిదండ్రులను ఆకర్షించేందుకు వివిధ రకాల ప్రకటనలు చేస్తున్నాయని తెలిపారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు పట్ల ఉన్న ఆందోళనతో ముందుగానే ఫీజులు చెల్లించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా, పాఠశాలలు విద్యాశాఖ నిర్ణయించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడం, అనధికారికంగా ఫీజులు వసూలు చేయడం, తల్లిదండ్రులను మభ్యపెట్టే ప్రకటనలు చేయడం వంటి చర్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యా హక్కులు, నిబంధనలు మరియు మార్గదర్శకాలను అమలు చేయడం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు అక్షయ్, శివ, త్రినయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ఎల్.బి.నగర్, మే 30 ప్రభాతవార్త :
రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పుట్టిన రోజు సందర్భంగా పివి.నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ లో బాస్, బిఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బసవరాజు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం అత్యవసరమని, ఇలాంటి శిబిరాలు ప్రతినిత్యం చేపట్టాలని యువతకు సూచించారు. శిబిరాన్ని నిర్వహించిన దడిగం సుధాకర్ శర్మ, వక్కలంక స్వరూప్ రాజ్, చరణ్ గౌడ్, ఆలూరిని అభినందించారు.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రక్తదానం శిబిరాలకు యువత ముందుకు వచ్చి రక్తాన్ని డొనేషన్ రూపములో అభినందనీయం అన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ ఎన్.వి.సుధాకరన్ మాట్లాడుతూ ఎవరైనా రక్తదానం చేయాలనుకుంటే మా చారిటబుల్ ట్రస్ట్ కు రావాలని, సహాయ సహకారాలు ఉంటాయన్నారు. బ్రాహ్మణ నాయకులు మంగపతిరావు మాట్లాడుతూ సమాజములో నేటి యువత పెడదోవలకు పోకుండా ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. శిబిరంలో శ్రీపాద రావు, సంతోష్ రెడ్డి, బాలకృష్ణ, 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమములో గోపికృష్ణమాచార్యులు, మురళి, నాగరాజు, రాజు, బాలాభాస్కర్, నారాయణన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న బసవరాజు శ్రీనివాస్, వక్కలంక శ్రీనివాస్

సహకార సంఘంలో మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరిస్తాం : ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ మే, 30, ప్రభాతవార్త:
సహకార సంఘం నుంచి తీసుకున్న రుణాలను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉన్న మొండి బకాయిదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. గత కొన్నేళ్లుగా తీసుకున్న రుణాలను సంఘానికి చెల్లించకుండా సంఘాభివృద్ధికి ద్రోహం చేసే వారి పేర్లను వారివారి గ్రామాల్లో అంటించడంతో పాటు వచ్చే సర్వసభ్య సమావేశంలో సభ్యులందరికీ చదవి వినిపిస్తామన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆవరణలో శనివారం జరిగిన సంఘం 58వ సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మాదిరిగా ప్లాట్లకు రుణాలను ఇచ్చే పద్దతిని పూర్తిగా నిలిపివేశామని, కేవలం పట్టాపాస్ పుస్తకాలున్న రైతులకే రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంఘాభివృద్ధి మనందరి బాధ్యత అని సకాలంలో రుణాలను చెల్లించి తిరిగి రుణాలు పొందుతూ సంఘాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంఘం ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులను జ్ఞాపికతో పాటు నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బింగి దాస్ గౌడ్, వైస్ ఛైర్మన్ నార్లకొండ మల్లమ్మ జంగమయ్య యాదవ్, మాజీ ఛైర్మన్ లు చేగూరి భరత్ కుమార్, పూరం యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు గుండె బాలనరసింహ, మొగుళ్ళ చిన్న యాదిరెడ్డి, పగిళ్ల బాల్ రెడ్డి, బిజిలి బాల నర్సయ్య, గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటికెల మహేందర్ రెడ్డి, మేకల రాముడు యాదవ్, చింతల లక్ష్మమ్మ, కందాడి మహిపాల్ రెడ్డి, సర్పంచ్ లు మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, దేసారం రాఘవేం దర్ గౌడ్, కోట ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఉప్పు నవీన్, మేడిపల్లి చంద్రశేఖర్ గౌడ్, రవీందర్ రెడ్డి, నాయకులు కొలం కొండల్ రెడ్డి, మూల మహేష్ గౌడ్, వడ్డేపల్లి పాపయ్య గౌడ్, సిబ్బంది, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల తస్మాత్ జాగ్రత్త



అత్తాపూర్ మే30,ప్రభాతవార్త :
సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు.శనివారం అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కిషన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో సిఐ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..మొబైల్ ద్వారానే సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు,యువకులు,విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అనుమానితులు కాల్ చేస్తే బ్యాంక్ వివరాలు, తదితర వాటిని తెలియజేయవద్దని అన్నారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీయం, ఫోన్ పే, గూగుల్ పే, ఈ కేవైసీ అప్‌డేట్ వివరాలు అడిగితే చెప్పకూడదని సూచించారు. సైబర్ నేరాలకు గురైనపుడు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు వెంటనే డయల్ చేసి ఫిర్యాదు చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ప్రశిక్షణ మహా అభియాన్ సభకు ఉప్పల్ నేతలు

బిజెపి ప్రశిక్షణ మహా అభియాన్ సమావేశంలో పాల్గొన్న బండారు శ్రీవాణి, తిండేరు హన్మంతరావు తదితరులు

రామంతాపూర్, మే 30 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పండిత్ దీన దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ జిల్లా బిజెపి శిక్షణ తరగతులకు పలువురు బిజెపి నేతలు తరలివెళ్లారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, మాజీ కౌన్సిలర్ తిండేరు హన్మంతరావు, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మార్నేని పణీందర్, గొరిగె కృష్ణ, యు.బి.చారి, మహంకాళి లక్ష్మన్, తీగ విఠల్‌రావు తదితరులు శిక్షణ తరగతులకు వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణలో బిజెపి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

ఉప్పల్, మే 30 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం స్వప్న శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మహా గణపతిమ్, జయ జయ రామనాధ, పుష్పాంజలి, అదిగో శ్రీ రామానుజ, కాలభైరవాష్టకం, చందాన చర్చిత తదితర అంశాలను కళాకారులు అధ్య, లక్ష్మి, మనస్విని, శృతిక, దక్ష, శ్రీవిద్య, శాన్వి , ధక్షిక, జాన్వీ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపిదే అధికారం

ప్రశిక్షణ శిబిరంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, మే 30 ప్రభాతవార్త:
భారతీయ జనతాపార్టీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో నాదర్‌గుల్ లోని విజ్ఞాన భారతి కేంద్రంలో నిర్వహిస్తున్న పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరంలో సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి , బిజెపి రాష్ట్ర నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్‌ను మరింత బలోపేతం చేయాలి : సిఎం రేవంత్‌రెడ్డి

సైదాబాద్, మే 30 ప్రభాతవార్త:
కాంగ్రెస్ సేవాదళ్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. టిపిసిసి పిఏసి సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ కలిసారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల సామర్థ్య శిక్షణా శిబిరం ముఖ్య ఉద్దేశ్యాలు, చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యక్రమాల గురించి ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా సిఎంను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్ మాట్లాడుతూ సేవాదళ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు ప్రజలకు చేరువయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ చేపడుతామని అన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డికి చరఖాను బహుకరిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

సీవరేజీ లైన్ వేయించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి

ఉప్పల్, మే 30 ప్రభాతవార్త :
ఉప్పల్ బీరప్పగడ్డ డివిజన్‌లోని లైబ్రరీ ఎదురుగా ఉన్న వీధిలో నూతన రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, దీంతోపాటు సివరేజీ పైప్‌లైన్ కూడా వేయించాలని బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు స్థానికులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు స్థానికులు మాట్లాడుతూ సిసి రోడ్డు వేయడంతోపాటు, డ్రైనేజీ లైన్ కూడా వేయాలని పలువురు కోరారు. పురాతన డ్రైనేజీ లైన్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, కొత్త లైన్ వేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందించి వెంటనే జలమండలి ఈడి పంకజతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు కొండల్‌రెడ్డి, వంజరి నర్సింగరావు, కావాలి తిరుపతి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, మహేశ్వరి, సుగుణమ్మ, ఉమా ,పద్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ లైన్ వేయించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీరప్పగడ్డ కాలనీ నేతలు

కారిడార్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : జెడ్‌సి రాధికగుప్తా

ఉప్పల్, మే 30 ప్రభాతవార్త :
ఉప్పల్, నారపల్లి కారిడార్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కోరారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ చౌరస్తాలో నిర్మిస్తున్న కారిడార్ నిర్మాణ పనులను ఎస్ఆర్‌డీపీ, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, ట్రాఫిక్, ఇంజినీరింగ్ మరియు టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కారిడార్ నిర్మాణం చేపట్టే సమయంలో తగు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులు జరుగుతున్న ప్రాంతాల్లో తగిన బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ చౌరస్తా వద్ద పిల్లర్ పనులు సాగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రాజెక్ట్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప్పల్ చౌరస్తాలో కారిడార్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కాప్రా డివిజన్ అభివృద్ధి : అధ్యక్షులు నాగ శేషు

కాప్రా డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం నిర్వహిస్తున్న డివిజన్ అధ్యక్షులు నాగశేషు బృందం...

కుషాయిగూడ, మే 30, ప్రభాతవార్త
ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని జిహెచ్ఎంసి కార్పొరేషన్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం పరమేశ్వర్ రెడ్డి తోనే సాధ్యమయ్యాయి కాంగ్రెస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు కొబ్బనూరి నాగేషులు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ రెడ్డి కాలనీలో ప్రధాన సమస్యగా వెలసిన భూగర్భ డ్రైనేజీ విషయమై కాలనీవాసులు డివిజన్ అధ్యక్షులు నాగ శేషు దృష్టికి తీగ కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి మందమల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి ద్వారా 42 కోట్ల నిధులను మంజూరు చేయించారని తెలిపారు. అభివృద్ధికి కారణమవుతున్న మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పరమేశ్వర్ రెడ్డిలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిట్టల నాయక్, మురళి శ్రీకాంత్ మల్లారెడ్డి ,శ్రీధర్ రెడ్డి ,జగదీష్ నరేందర్ గౌడ్ ,ప్రేమిక ,రాజశేఖర్, తిరుపతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

వనస్థలిపురం మే30,ప్రభాతవార్త
వనస్థలిపురంలో హుడా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండిక్రాఫ్ట్ మేళా చూపరులను ఆకట్టుకుంటున్నది.ఈ ప్రదర్శనలో మంగళగిరి,ఉప్పడా, వెంకటగిరి, భాగల్పూర్ చీరలు, కాంతవర్క్,ప్రింటెడ్ చీరలు,కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్ లు,వన్ గ్రామ్ గోల్డ్ జేవెలరీ,జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు తదితర వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని,కాలనీవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు అక్బర్ అలీ పేర్కొన్నారు.ఈ ప్రదర్శన కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

డ్రైనేజీ లీకేజీతో రోడ్లపై పారుతున్న మురుగునీరు

రామంతాపూర్ వివేక్‌నగర్ బైపాస్ రోడ్డ వద్ద డ్రైనేజీ లీకేజీలతో రోడ్లపై పారుతున్న మురుగునీరు దృశ్యం.

రామంతాపూర్, మే 30 ప్రభాతవార్త : రామంతపూర్ వివేక్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద బైపాస్ రోడ్ లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్ నిండిపోయి రోడ్లపై లీకేజీలతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయని బిజెపి సీనియర్ నేత వాసం పాండు పేర్కొన్నారు. బైపాస్ రోడ్డ వెంట మురుగునీరు కుంటలాగా మారి వాహనదారులకు, కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిత్యం దుర్వాసనలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వాహనదారులు రోడ్లపై వెళ్లే సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. నిత్యం ఈ దారిలో వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయని, అధికారులు స్పందించి పనులు చేపట్టాలని ఆయన కోరారు.